

# ఇదీ సమాధానం

## —చెళ్ళూరి సీతారాజేశ్వరరావు

చెరకుతోట చూసి కాలదగ్గరకి వచ్చే సరికి సాయంత్రమైపోయింది. పశ్చిమ కిరణాలు కొబ్బరిచెట్లమీద ఏటవాలుగా పడుతున్నాయి. పాలేరు ఎడ్లకి దాణా పెడుతున్నాడు. ఎదురుగా వున్న సిమెంటు అరుగుమీద భగవంతం విశ్రాంతిగా కూర్చున్నాడు. కాలవ మీద నుంచి చల్లటిగాలి వీస్తూండడంవల్ల ప్రాణం తెరిపిగా వుంది.

ఇంటిదగ్గరనుంచి జనప అత్తనాలు తెచ్చిన దానయ్య పేపరు, ఉత్తరాలు భగవంతానికి ఇచ్చాడు. నీలిరంగు కవరు చూడగానే భగవంతం వులిక్కి-పడ్డాడు.- చింతామణి రాసేడేమో... చివరకి వూహే నిజమయింది.

ఉత్తరం క్లుప్తంగా ఎర్ర సిరాతో రాసి "నాలుగు రోజుల్లో వస్తున్నాను. డబ్బు సిద్ధంచేసి వుంచు. ఇప్పటికే

చాలా ఆలస్యమైందని నీకు తెలిసే వుంటుంది."

చింతామణి సూటిగా రాయడం చాల బాధగా వుంది. తను చేసిన సాయం మరిచిపోయాడు. యాభై వేలు మరచి పోలేదు.

తను ఎంత కృషిచేస్తే చింతామణి సింహాసనం ఎక్కాడు? డబ్బు వుందని తెలిస్తే పదవి వరుగెత్తి వస్తుందా? ఎవర్ని ఎలా జోకొట్టాలో అలాచేసి అసెంబ్లీకి పంపించాడు ఖర్చులేకుండా. తన శ్రమకి యాభై వేలు సరిపోదు.

చింతామణి చాలా కృతఘ్నుడు. అవసరం తీరగానే మనుషుల్ని దూరంగా గెంటివేయడం వాడి లక్షణం. ప్రస్తుతం తన పనేంలేదు. అందుకే అడిగాడు.

భగవంతానికి తీవ్రంగా కోపం వచ్చింది. కసిగా చుట్టని కొరికి కాలవలో పడేశాడు ఏదో పరిష్కారం చూడాలి. దెబ్బకి దెబ్బ

మర్నా డుదయం మండువాలో కూర్చున్నాడు స్నానంచేసి వంటమనిషి వేడి వేడి పూరీ తెచ్చి యిచ్చింది. భగవంతం తిండి పుష్టికలవాడు. వున్న వాళ్ళకి వుండే జబ్బులేంలేవు లేనివాళ్ళ కున్న ఆకలిజబ్బుమాత్రం వుంది. ఇరవై పూరీలు తిని కాఫీ త్రాగాడు పసందయిన లంకపుగాకు చుట్ట వెలిగించాడు.

"ఇది విన్నారూ" నాగరత్నం వసారాలోనుంచి వస్తూ అంది.

"నువ్వే చెప్పండే."

"పెద్దాడి ఉత్తరం..."

"ఓహ్...అదా" చింతామణి వుత్తరంతో మిగతావి చదవలేదు. చూడ లేదంటే నాగరత్నం నోరు విప్పుతుంది.

'డబ్బుగురించే కదా మనవాడు రాసేది" సమయోచితంగా అన్నాడు.

"ఆచారితో బ్యాంకికి వెళ్ళేటప్పుడు చెప్పండి."

"అదేదో నువ్వుచూడు. ఇవాళ చాల పనుంది."

గేటు తీసుకుని డేనియల్ లోపలికి వచ్చాడు. వీధి గుమ్మంలో ఆగిపోయి పొడిగా దగ్గాడు. భగవంతం చూశాడు. డేనియల్‌లో మార్పు కనిపెట్టాడు. కోపాన్ని అణచుకుని "ఏమిటి?" అన్నాడు.

"సెలవు కావాలండి."

"సరే"

"రెండొందలు కావాలి. చుట్టాలు వచ్చారు?"

"ఎప్పుడు?"

"ఇప్పుడే"

"భగవంతం తేరిపార చూశాడు. డేనియల్ నిర్లక్ష్యంగా నించున్నాడు. కంఠంలో వినయం లేదు. భగవంతానికి నిన్న గుర్తు వచ్చింది.

నిన్న మధ్యాహ్నం భోజనంచేసి హాల్లో పచార్లు చేస్తున్నాడు. ప్రకృతి భారంగా వుంది చలిగాలి వీస్తోంది.

నాగరత్నం కారులో పుట్టింటికి వెళ్ళింది.

జూలీ తలుపు తట్టింది.

డేనియల్ చెల్లెలు నల్లగావున్నా పదు నుగావున్న చాకులా వుంటుంది. యవ్వనం జలపాతంలా ఎగసిపడుతోంది ఆమెలో.

"ఏం వచ్చావ్?" భగవంతం కళ్లలో కాంక్ష.

"జీతం యిస్తానన్నారుట. మా అన్నయ్య నన్ను తీసుకురమ్మన్నాడు."

"నాతో రా' లోపలికి దారి తీశాడు. తన గదిలోకి వెళ్ళి బీరువా తెరిచాడు. జూలీ గుమ్మంలో నిల బడింది బెరుకుగా.

"ఎంత కావాలి?"

జూలీ భయపడింది.

"తీస్కో" గుప్పెడు నోట్లు యిచ్చాడు.

జూలీ తీస్కోలేదు. 'బాబుగారూ' అంది భగవంతంలోని మృగాన్ని చూస్తూ. భగవంతం దగ్గరకి వెళ్ళి "ఫర్వాలేదు... పుచ్చుకో...నీ అందానికి ప్రతిఫలం. ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్నాను" తలుపు మూశాడు,

జూలీ భయంగా అరచింది.

భగవంత ఆమెని దగ్గరకి లాక్కు న్నాడు. బలంగా కౌగలించుకుని పెదాలు చుంబించి "నువ్వు కావాలి జూలీ" అన్నాడు.

"వదిలెయ్యండి ... నేనలాంటిదాన్ని కాను" పెనుగులాడింది.

జూలీ ఓడి పోయింది. భగవంతానికి దాసయింది. తిరునాళ్ళనుంచి తిరిగి వెళ్ళే యాత్రికుడిలా నీరసంగా బయటకు వెళ్ళింది.

రాగానే అన్నయ్యతో చెప్పి వుంటుంది. వాడేం చెయ్యగలడు? డేని యల్ తనకి డ్రయివర్. ప్రభువుని ఢీ కొడితే వాడి పళ్ళే విరుగుతాయి. ఆ ఉక్రోషంతో వచ్చాడు.

భర్త అడగ్గానే డబ్బివ్వడం నాగ రత్నానికి ఆశ్చర్యమయింది.

"వాడలా మాట్లాడతాడేమిటి?" నాగరత్నం ఆరాతీసింది.

"ఏం లేదు." భగవంతం తప్పించు కున్నాడు.

భగవంతం సాయంత్రం పొలంనుంచి వచ్చి హాల్లో కూర్చున్నాడు నాగరత్నం కబుర్లు చెబుతోంది దగ్గర కూర్చుని.

డేనియల్ సిగరెట్ కాలుస్తూ అరుగు మీద నించున్నాడు. భగవంతం కోపంగా వీధిలోకి వెళ్ళాడు.

"రెండువేలు కావాలి" పొగరుగా అడిగాడు.

"ఇవ్వకపోతే..."

"అమ్మగారితో చెప్పాల్సివుంటుంది."

వీడు తనని బ్లాక్‌మెయిల్ చేస్తు న్నాడు. ఇలాంటి విషయాలు నాగ

రత్నానికి తెలిస్తే ఎంతయినా గొడవ చేస్తుంది. కొంపలో శాంతి వుండదు.

డేనియల్‌కి డబ్బిచ్చి పంపి ఆలోచిస్తూ కూర్చున్నాడు.

“ఏమిటి వాడికి మళ్ళీ డబ్బిచ్చారు?”

“మున్సబు అప్పు అడిగాడు. పీడి చేత పంపాను.” భగవంతం మనస్సు రణరంగంలా వుంది, తన దగ్గర బ్రతికే డేనియల్ తనని బెదిరిస్తున్నాడు. డబ్బుతో ఎంతకాలం వాడి నోరు ముయ్యగలం?

శాశ్వతంగా మూసివేస్తే?

భగవంతానికి యిలాంటివి కష్టం కాదు. డబ్బుతో ప్రాణాలని అంతం చేయగలడు. గతంలో ఎన్నో చేయించాడు'

ఆ రాత్రి చింతామణి వచ్చాడు

“ఏం చేశావు డబ్బు? భోజనాలయ్యాక అడిగాడు.

“రెడీగానే వుంది. క్రితంసారి వచ్చినపుడు అంతర్వేది వెడదామన్నావుగా! ప్రయాణం రెడీ చేశా”

“వచ్చేసారి చూద్దాం”

“లాభంలేదు. రేపు వెళ్ళి వచ్చేద్దాం”

చింతామణి అంగీకరించాడు.

అరయ్యేసరికి యిద్దరూ కారెక్కారు. బయలుదేరుతూండగా ఎవరో వచ్చారు, భగవంతంకోసం.

“చింతా...చిన్న పని తగిలింది. నువ్వు పూజ సాగిస్తూండు. నాయుడు కార్లో వచ్చేస్తాను నేను” భగవంతం హడావిడిగా వెళ్ళిపోయాడు.

భగవంతం నేరుగా తోటలోకి పోయి కూర్చున్నాడు. పాలేరు తెచ్చే శుభవార్త కోసం ఎదురుచూస్తున్నాడు

కారు పాలెం రోడ్డు ఎక్కుతుంది, డేనియల్ రాష్ డ్రయివింగ్, ఈ సమయంలో రద్దీగా వుంటుంది హూద రోడ్డు. బ్రేక్ నొక్కబోతే అవి పనిచేయవు పాపం. చింతామణికి, డేనియల్‌కి చివరి ప్రయాణం.

భగవంతానికి కోపంవస్తే ఫలితమేమిటో యిద్దరికీ అనుభవ మవుతుంది. చింతామణి బాకీ ఎగనామం. కాగితం లేదు. జూలీ దిక్కులేనిదై చివరకి తన కాళ్ళదగ్గరకే వస్తుంది.

తానుచేసిన రాక్షసకృత్యం యిచ్చే ఫలితాలను మదింపు చేసుకుంటూ భగవంతం అశాంతిగా తిరుగుతున్నాడు తోటలో

పాలేరు పరుగున వచ్చాడు.

“అయ్యగోరూ...మన కారు ఒంతెనకి గుద్దేసిందిట...అమ్మగారు చావు బతుకుల్లో వున్నారు?”

“చింతామణి కాదురా వెళత?”

“ఆయన గుండెనెప్పి వచ్చి మానేశారు. అమ్మగారు ఎల్లారు దానిమీద. డేనియల్‌కి సిన్న దెబ్బకూడ తగల్లేదండి.”

భగవంతానికి భగవంతుడు కనిపించాడు.